నిబంధనలు పూడ్చి.. చెరువులు తవ్వి !


చెరువు తవ్వకాన్ని నిలుపుదల చేయాలని నిరసన తెలుపుతున్న గ్రామస్తులు


ఇళ్లపై వేసిన మట్టి

భీమవరం అర్బన్: రొయ్యలు, చేపలు పెంపకంలో అధిక లాభాలు రావడంతో వరి చేలను రాత్రికి రాత్రే ఆక్వా చెరువులుగా మార్చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పొక్లెయిన్‌తో తవ్వడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన మత్స్యశాఖ, రెవెన్యూ, వ్యవసాయ, మైనింగ్ తదితర శాఖల అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండటంతో ప్రభుత్వానికి ఆదాయం రాకపోగా సర్వత్రా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో తుందుర్రు రెవెన్యూ పరిధిలో పెదగరువు గ్రామ పంచాయతీలోని చినగరువుకు వెళ్లే రోడ్డులోని చినపేట వద్ద ఇళ్ల మధ్య ఆర్ఎస్ నంబర్ 361లో రెండు ఎకరాల వరి పొలాన్ని ప్రొక్లెయిన్ సహాయంతో 8 అడుగుల లోతులో ఆక్వా చెరువు తవ్వుతుండటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ చెరువు గట్లను తవ్వి తమ ఇళ్లకు చేర్చి వేస్తున్నారని వాపోతున్నారు. ఈ చెరువుకు మురుగు నీరు పారేందుకు అవుట్‌లెట్ లేకపోవడంతో పంట కాలువలోకి తీయాలని దీంతో ఆ కాలువ కలుషితమై ఆ ప్రభావం నీటిని తాగే 700 మంది గ్రామస్తుల ఆరోగ్యంపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఏరియేటర్లు తిప్పేటప్పుడు సౌండ్ పొల్యూషన్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని, ఇళ్ల మధ్య ఈ చెరువు తవ్వడం వలన తమ పిల్లలు ఆడుకోవడానికి వెళ్లి చెరువులో పడితే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. చెరువు చుట్టూ విద్యుత్ వైర్లు ఉంటాయని ఆ వైర్లు తగిలితే ప్రమాదమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు

ఎక్కువ ప్రొక్లెయిన్ల సాయంతో తక్కువ రోజుల్లో నిబంధనలకు విరుద్ధంగా పంట భూములను ఆక్వా చెరువులుగా మార్చేస్తున్నారు. వరి చేలను ఆక్వా చెరువులుగా మార్చాలంటే మత్స్యశాఖ, రెవెన్యూ, అగ్రికల్చర్, మైనింగ్ తదితర శాఖల అనుమతులు ఉండాలి. తద్వారా ప్రభుత్వానికి కొంత ఆదాయం సమకూరుతుంది. జీవో 110 ప్రకారం శ్మశానానికి 60 మీటర్లు, రోడ్డుకు 10 మీటర్లు, ఇళ్లకు 100 మీటర్ల దూరంలో ఉండేలా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి అనుమతులు జారీ చేయాలి. అధికారులకు డబ్బులు ఇస్తే చాలు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కూతవేటు దూరంలో కలెక్టరేట్ ఉన్నా

ఆక్వా చెరువులకు కూతవేటు దూరంలో భీమవరం కలెక్టరేట్ ఉంది. దీంతో ఉన్నతాధికారులు నిత్యం తిరుగుతూనే ఉంటారు. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో దిగువ స్థాయి ఉద్యోగులు మామూళ్ల మత్తులో అటువైపు కన్నెత్తిచూడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అనుమతులు లేని చేపలు, రొయ్యల చెరువులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.

ఇళ్ల మధ్య చెరువును తవ్వుతున్నారు



ఇళ్ల మధ్య చెరువు తవ్వడమే కాకుండా మా ఇళ్లపైకి మట్టి వేస్తున్నారు. ఆ చెరువుకు మురుగు బోదె లేదు. పంట కాలువల్లోకే వదలాలి. ఆ నీటిని తాగి మా చినపేట గ్రామస్తులు అనారోగ్యానికి గురవుతారు. ముందుగానే అధికారులు పర్యవేక్షించి చెరువు తవ్వకాన్ని నిలుపుదల చేయాలి.

–పాలపర్తి జ్ఞానరాజు, గ్రామస్తుడు, చినగరువు

చెరువు తవ్వకాన్ని నిలుపుదల చేశాం

చినపేట గ్రామస్తుడు పాలపర్తి జ్ఞానరాజు ఫిర్యాదు మేరకు చెరువు తవ్వకాన్ని నిలుపుదల చేశాం. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తగు చర్యలు తీసుకుంటాం. ఈ లోపు చెరువును తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటాం.

–రావి రాంబాబు, తహసీల్దార్, భీమవరం

రంజాన్‌లో ఇఫ్తార్ విందు కీలకం


ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి

ఆకివీడు: రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు కీలకమని కలెక్టర్ నాగరాణి చెప్పారు. స్థానిక షాదీఖానాలో ముస్లిం నాయకుడు ఎండీ బి.ఆతీఫ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు శుక్రవారం నిర్వహించారు. విందులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా ఆకివీడు ప్రాంతం నిలిచిందన్నారు. అన్ని మతాల వారు ఐక్యంగా జీవించడం వలన దేశం, ప్రపంచం శాంతియుతంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీ సతీమణి డాక్టర్ హీనా, డీఎస్పీ సతీమణి శృతి రెడ్డి, అధికారులు, స్థానిక ముస్లింలు, వైద్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: కోలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు చేపట్టనున్నారు. ఈ మేరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపిస్తామని ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గృహ, పారిశ్రామిక వినియోగదారులతో పాటు ఆక్వా చెరువులకు కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

క్యాంపస్ సెలక్షన్స్‌లో విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

భీమవరం: స్థానిక డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కాగ్నిజెంట్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకటనర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు చెప్పారు. ఉద్యోగాలు సాధించిన రుద్రరాజు సత్య శివాని, పేరిచర్ల అనూష, మొహమ్మద్ ముజాహిద్, టేకి గంగా లక్ష్మీరామాంజి, ముదునూరి సంధ్యారాణిలను శుక్రవారం కళాశాలలో అభినందించిన సందర్భంగా వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగ రాజు, ప్రిన్సిపల్ ఎం.అంజన్‌కుమార్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సీహెచ్ రామ్‌కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడల్లో బీవీ రాజు విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న డైరెక్టర్లు

భీమవరం: పట్టణంలోని బీవీ రాజు డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి హాకీ, నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి సర్టిఫికెట్లు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ ఐఆర్ కృష్ణంరాజు చెప్పారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులను అభినందించిన సందర్భంగా వివరాలను వెల్లడించారు. ఇటీవల హర్యానాలో నిర్వహించిన 15వ హాకీ సీనియర్ నేషనల్ ఉమెన్స్ డివిజన్ కేటగిరిలో పి.దుర్గాభవాని విన్నర్‌గా నిలవగా జూనియర్ నేషనల్ 37వ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో కె.భారతి ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. క్రీడాకారులను కళాశాల డైరెక్టర్లు జె.ప్రసాదరాజు, పి.శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్‌వీ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ జి.పవన్‌కుమార్ రాజు అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

భీమవరం: ఫైనాన్స్ అండ్ చిట్ ఫండ్స్ ప్రొప్రైటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శుక్రవారం నిర్వహించిన అసోసియేషన్ వార్షిక జనరల్ బాడీ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీబొండాడ రామమోహనరావు (రాంపండు), నల్లం రఘుబాబు, ఉపాధ్యక్షుడిగా కొత్త శ్రీనివాస్, పరుచూరి వెంకట చిననాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా ఆర్.శ్రీనివాసరావు, గుండు సుమూర్తి, కోశాధికారిగా గాదె వెంకట సురేష్, మరో 12 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే చాంబర్ ఆఫ్ కామర్స్ కార్య నిర్వాహక వర్గ సభ్యుడిగా ఇర్రింకి నారాయణమూర్తిని ఎంపిక చేశారు.

యూపీఎఫ్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు


ఆర్థిక సాయం అందిస్తున్న కమిటీ ప్రతినిధులు

ఉండి: యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్(యూపీఎఫ్) సమావేశం శుక్రవారం ఇండియన్ పెంతెకొస్తు చర్చి(ఐపీసీ)లో పాస్టర్ నల్లి సామ్యూల్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న సేవకులకు ఆర్థిక సాయం అందించారు. ఐపీసీ సంఘంలోని సుమారు 2 వేల మంది సభ్యులకు 50 శాతం రాయితీతో హెల్త్ కార్డులను కమిటీ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. రాపాక జయరాజు, ఈలి డేవిడ్‌మార్క్, సోడదాసి వరదానం, నన్నేటి చంద్రబాబు, నీతిపూడి యోహాను, నల్లి సామ్యూల్‌రాజు, తెనాలి సుధాకర్, బలే బేబి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం తనిఖీ

వీరవాసరం: ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించి, ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డ్వామా పీడీ డాక్టర్ సీహెచ్ అప్పారావు తెలిపారు. వీరవాసరం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలో పాల్గొని ఆయన మాట్లాడారు. సామాజిక తనిఖీల్లో రూ.25,327 రికవరీ చేశామన్నారు. రూ.7,35,000 పనులపై విచారణ చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, ఎంపీడీవో బి.అప్పారావు, వైస్ ఎంపీపీ పాల్గొన్నారు.

పశుగ్రాసం పెంపకానికి ఆర్థిక సాయం


పశువైద్య శిబిరంలో పాల్గొన్న పశు సంవర్ధకశాఖ అధికారులు, రైతులు

ఆకివీడు: పశుగ్రాస పెంపకానికి పూర్తి సబ్సిడీతో ఆర్థిక సాయం అందుతుందని పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశుగ్రాస ఉత్పత్తి చేపట్టాలని సూచించారు. పశుగ్రాస ఉత్పత్తికి పూర్తి సబ్సిడీ అందుతుందన్నారు. పదిసెంట్ల భూమి నుంచి 50 సెంట్ల భూమి కలిగి, తెల్ల రేషన్ కార్డు, జాబ్‌కార్డు ఉన్న వ్యక్తులు పశుగ్రాస ఉత్పత్తికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. డివిజన్ పరిధిలో 80 శాతం పశు గణన పూర్తయిందని చెప్పారు. మార్చి 31వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో పశు గణన పూర్తవుతుందన్నారు. పశువుల్లో వచ్చే గాలుకుంటు వ్యాధిని అంతం చేసేందుకు రైతులు ముందుగా పశువులకు టీకాలు వేయించాలన్నారు. లేగ దూడలకు నట్టల నివారణ మందులు తగిన సమయంలో వేయించాలని సూచించారు. ఆరోగ్యకరమైన లేగ దూడలే రేపటి పాడి పశువులని రైతులు గుర్తించాలన్నారు. దూడలకు లివర్ టానిక్, కాల్షియం టానిక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 20 మంది రైతులకు ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు ఆర్థిక సహకారంతో బనియన్లను పంపిణీ చేశారు. లేగదూడల అందాల పోటీలు నిర్వహించారు. 20 లేగదూడలకు బ్రూసెల్లా వ్యాక్సిన్, 180 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల అనురాధ, ఉపసర్పంచ్ జన్ను గోపి ఏడీ మల్లిఖార్జునరావు, మండల పశుసంవర్ధక శాఖ అధికారిణి కెల్లా భార్గవీ సత్య, నంద్యాల చల్లారావు, ముత్యాల బుజ్జి, వెటర్నరీ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం


కార్యక్రమంలో మాట్లాడుతున్న రవి విన్సెంట్

భీమవరం: భూగోళాన్ని భూమిపై నివసిస్తున్న సకల ప్రాణుల జీవితాలను స్వర్గతుల్యం చేయడమే కవిత్వ ఆశయమని ఆంధ్ర యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం సహాయాచార్యులు ఎస్.రవి విన్సెంట్ చెప్పారు. భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ కవితా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవ జీవితంతో పాటు సకల ప్రాణుల జీవితాలు సుఖమయం కావటానికి కవిత్వం పాటు పడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వీకేజే ప్రసూన మాట్లాడుతూ జాతీయోద్యమ పోరాట కాలంలో చిలకమర్తి, గరిమెళ్ల వంటి జాతీయ కవుల పద్యాలు సామాన్య ప్రజలను చైతన్య వంతులను చేశాయన్నారు. కేజీఆర్ఎల్ కళాశాల ఆంగ్ల విభాగాధిపతి ఇమ్మానుయేల్ మాట్లాడుతూ కవిత్వం ప్రజల జీవితాలకు అర్థం పరమార్థం బోధిస్తుందన్నారు. అనంతరం కవిత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కాకుమాని శ్రీనివాసరావు, జి.కిరణ్‌బాబు, పి.అరవిందస్వామి, జి.ఉమా మహేశ్వరి, నర్సింహారావు, సీహెచ్ సత్యనారాయణ, పి.అమూల్యారావు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ల వేతనాలు పెంచాలి

భీమవరం: నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో పని చేస్తున్న తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ల వేతనాలను పెంచాలని ఏపీ తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.బసవరాజు, ఎస్.దేవీప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్చి 31వ తేదీతో కాంట్రాక్ట్ ముగియనున్నందున కూటమి ప్రభుత్వం రానున్న టెండర్లలో రూ.18 వేలు జీతంగా నిర్ణయించాలన్నారు. చాలీచాలని వేతనాలతో గత పదేళ్లుగా పని చేస్తున్నామని పెరిగిన ధరలకు అనుగుణంగా ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ల వేతనాన్ని పెంచాలన్నారు. ప్రభుత్వ చట్టాలు, నిబంధనలు, సెలవులు, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వ స్కీంలో భాగంగా పని చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ వహించాలన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేసి ప్రభుత్వం నేరుగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

వెంకటస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలి


వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గోపిమూర్తి, తదితరులు

భీమవరం: యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి అన్నారు. వెంకటస్వామి 24వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి గోపిమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు సీహెచ్ పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు సీహెచ్ కుమారబాబ్జి, జి.రామకృష్ణంరాజు, కేఎస్ రామకృష్ణ ప్రసాద్, డి.ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతకు సైన్స్ దోహదం


సైన్స్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, తదితరులు

భీమవరం: విద్యార్థుల్లోని సృజనాత్మకను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ దోహదం చేస్తుందని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం త్యాగరాజ భవనంలో సర్ సీవీ రామన్ స్కూల్ ఏర్పాటు చేసిన ×ఎడ్యు ఎక్స్ పో ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. సైన్స్ ఫెయిర్ ద్వారా కొత్త ఆలోచనలతోనే వినూత్న ఆవిష్కరణ పుట్టుకొస్తాయన్నారు. ఆర్టీసీ భీమవరం డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు మిసైల్ మెన్ ఆఫ్‌గా పేరు పొందిన ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ పెండ్యాల సరిత, చెరుకువాడ రంగసాయి, గన్నాబత్తుల శ్రీనివాస్, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలకు కూటమి ప్రభుత్వం షాక్


విద్యుత్ షాకల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

భీమవరం: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు విషయంలో ప్రజలకు ఇచ్చిన హామీని విస్మరించి ప్రజలకు షాక్ ఇచ్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ తీవ్రంగా దుయ్యబట్టారు. సీపీఎం రాష్ట్ర కమిటీ ముద్రించిన విద్యుత్ షాకుల బుక్‌లెట్‌ను శుక్రవారం భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వం చేసిన మోసాన్ని వివరించేందుకు బుక్‌లెట్‌ను ముద్రించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి 10 నెలలు గడిచినా హామీల అమలుకు నోచుకోలేదని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో సెకీ(ఆదాని)తో ఒప్పందం రద్దు చేయడం కుదరదని పెనాల్టీ పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు మరోసారి అబద్ధాలు చెప్పి తప్పుదోవ పట్టిస్తున్నారని గోపాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.వాసుదేవారావు, జిల్లా కమిటీ సభ్యులు జె.సత్యనారాయణ, మల్లిపూడి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు


సేవలందిస్తున్న వైద్యులు


రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రోగులు

పాలకోడేరు: మంచి గాలి, ఆహారం, వ్యాయామం ఉంటే ఎటువంటి అనారోగ్యాలు దరి చేరవని భీమవరం మిత్ర మెడికేర్ హాస్పిటల్ వైద్యులు కర్రా ప్రశాంత్ అన్నారు. శుక్రవారం శృంగవృక్షం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో ఆయన వైద్య సేవలు అందించారు. సుమారు 300 మంది రోగులకు బీపీ, షుగర్, గుండె జబ్బులకు ఇసిజి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ జీవన విధానం సక్రమంగా లేకపోవడంతో అధిక శాతం మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. ఆర్థో పెడిషియన్ వైద్యులు కాకులపాటి శ్రీ వర్ధన్ మాట్లాడుతూ అధిక బరువు వలన నడవడమే కష్టంగా మారిందన్నారు. శిబిరంలో సుమారు 25 మంది వైద్యులు, సిబ్బంది సేవలు అందించారు. కార్యక్రమంలో గ్రంధి రాజా, సోము రామకృష్ణ, ఆత్యం వాసు, కూర్మాల కాశీ, గుప్త, తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లోపం.. ప్రయాణికులకు శాపం


పెనుగొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి


ఫ్లైఓవర్‌పై పేరుకు పోయిన ఇసుక

పెనుగొండ: పెనుగొండ ఫ్లైఓవర్ నిర్వహణ లోపంతో తరచూ గోతుల మయంగా మారి రాకపోకలకు వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. పెనుగొండలో బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జిని తొలగించి, దాని స్థానంలో 15 ఏళ్ల క్రితం ఫ్లైఓవర్ నిర్మించారు. ఈ నిర్మాణంలో కాంక్రీటు పోత అనంతరం కెమికల్ పూతను విస్మరించారు. దీంతో తరచూ ఫ్లైఓవర్ మరమ్మతులకు గురవుతుదని టెక్నికల్ ఇంజనీర్లు తేల్చి చెప్పినా, నిధులు మంజూరు కాకపోవడంతో తూతూ మంత్రంగా మరమ్మతులు చేస్తూ రోడ్లు భవనాల శాఖ కాలం గడిపేస్తోంది. ఏడేళ్ల క్రితం చేపట్టిన పెనుగొండ మార్టేరు రహదారి విస్తరణలోనూ ఫ్లైఓవర్‌ను పట్టించుకోలేదు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా ఫ్లైఓవర్‌కు మరమ్మతులు చేసి వదిలేశారు.

పేరుకుపోతున్న మట్టిదిబ్బలు

ఫ్లైఓవర్‌పై కనీస నిర్వహణ లేకపోవడంతో ఇరువైపులా మట్టి, ఇసుక పేరుకుపోతుంది. దీంతో మోటారు సైక్లిస్టులు, సైక్లిస్టులు జారి పడి గాయాల పాలవుతున్నారు. వర్షాలు పడినపుడు నీరు కిందికి వెళ్లకుండా వంతెనపై హోల్స్ అన్నీ మట్టి, ఇసుకతో నిండిపోయి గోతులు ఏర్పడుతున్నాయి. దీంతో తరచూ ఫ్లైఓవర్ మరమ్మతులు చేయాల్సివస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి నిర్వహణ పనులు చేపట్టి ఫ్లైఓవర్ పాడవకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తపాలా శాఖలో ప్రమాద, ఆరోగ్య బీమా

పెనుమంట్ర: భారత ప్రభుత్వం తపాల శాఖ ద్వారా జీవిత ప్రమాద బీమా తోపాటు తక్కువ ప్రీమియంతో ఆరోగ్య బీమ సౌకర్యాన్నీ అమలు చేస్తోందని తపాల శాఖ డివిజనల్ సూపరింటెండెంట్ కె.హరికృష్ణ ప్రసాద్ అన్నారు. శుక్రవారం పెనుమంట్ర దాట్ల భవన్లో తపాలా శాఖ తణుకు సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.సూరి ప్రకాష్‌రావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో హరికృష్ణ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏడాదికి రూ.899 ప్రీమియంతో రూ.15 లక్షలు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. 18 సంవత్సరాల నుంచి 60 ఏళ్ల వయసు వరకు ఈ ఆరోగ్య బీమా కవరేజీ ఉటుందన్నారు. 18 నుంచి 65 ఏళ్ల వయసు వరకు కుటుంబ ఆరోగ్య పాలసీలను పొందే సౌకర్యం తపాల శాఖలో ఉందని తెలిపారు. ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సదస్సులో భీమవరం డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీఏకే కుమార్, ఇండియన్ పోస్ట్ బ్యాంక్ జిల్లా మేనేజర్ కళ్యాణ్, వివిధ తపాల కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంగ్లీషు పరీక్షకు 13 మంది గైర్హాజరు

ఉండి: మండల వ్యాప్తంగా ఐదు పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పదో తరగతి ఇంగ్లీషు పరీక్షకు శుక్రవారం 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఎన్నార్పీ అగ్రహారంలో ఇద్దరు, ఉండి ఏ సెంటర్‌లో నలుగురు, బీ సెంటర్‌లో ముగ్గురు, ఉప్పులూరు సెంటర్‌లో నలుగురు విద్యార్థులు చొప్పున పరీక్షకు హాజరు కాలేదు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 12 మంది, కంపార్ట్‌మెంటల్ విద్యార్థి ఒకరు పరీక్షకు గైర్హాజరయ్యారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

పాలకోడేరులో 19 మంది గైర్హాజరు

పాలకోడేరు: శుక్రవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షకు పాలకోడేరు మండల వ్యాప్తంగా 604 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 585 మంది విద్యార్థులు మాత్రమే హాజరై 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి పెనుమత్స వెంకటశివ నాగరాజు తెలిపారు. పాఠశాలల వారీగా గొల్లలకోడేరు సెంటర్‌లో 160 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 156 మంది విద్యార్థులు హాజరై నలుగురు గైర్హాజరయ్యారని తెలిపారు. పాలకోడేరు సెంటర్‌లో 110 మంది విద్యార్థులకు గాను 109 మంది విద్యార్థులు హాజరై ఒకరు గైర్హాజరయ్యారని, శృంగవృక్షం సెంటర్‌లో 225 మంది విద్యార్థులకు 221 మంది విద్యార్థుల హాజరై, నలుగురు హాజరయ్యారని, మోగల్లు 109 మంది విద్యార్థులకు 99 మంది విద్యార్థులు హాజరై పది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

ఉండి: ఎండలు మండుతున్న సమయంలో మహదేవపట్నం సచివాలయ అధికారులు చలివేంద్రాన్ని ప్రారంభించి మానవత్వాన్ని చాటుకున్నారు. పంచాయతీ కార్యదర్శి కె.గోపాలకృష్ణ, వీఆర్వో చిన్నారావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కె.నాగార్జున, ఎంపీడీవో రవీంద్ర ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని ప్రారంభించి బాటసారులు, గ్రామ ప్రజలకు తాగునీటిని అందజేశారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాగునీరు, మజ్జిగను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.